క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



భగవద్గీత ప్రచారంలో సభ్యులు

కర్నూలు కల్చరల్: త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం పరమ పవిత్ర త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. సూర్య దేవాలయం ప్రాంతం, వివేకానంద నగర్, ఉద్యోగ నగర్‌లలో కల్లూరు కమిటీ సభ్యులు భగవద్గీత ప్రచారం చేశారు. కమిటీ అధ్యక్షుడు పురుషోత్తం, సభ్యులు ఓబులేసు, సుధాకర్, శివ, వేణు, అక్షిత్, అవినాష్, అల, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఆదిత్య హృదయ పారాయణం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం భాను సప్తమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యనారాయణ స్వామి జన్మతిథి సప్తమి పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామివారికి విశేష జలాలు, పంచామృతంతో అభిషేకం, ఆదిత్య హృదయ పారాయణం, ఆదిత్య హృదయ హోమం భక్తి శ్రద్ధలతో చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

26న నగర పాలక సర్వ సభ్య సమావేశం

కర్నూలు (టౌన్): ఈనెల 26న శనివారం నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్. రవీంద్ర బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన సమావేశం జరుగుతుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, బొగ్గుల దస్తగిరి, డిప్యూటీ మేయర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. 19 అంశాలతో కూడిన అజెండాపై చర్చించనున్నట్లు తెలిపారు.

డీఎస్సీని ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలి

కర్నూలు(సెంట్రల్): పరీక్షకు దరఖాస్తు చేసిన ప్రతి అభ్యర్థికి సమన్యాయం జరగాలంటే డీఎస్సీ పరీక్షను ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ప్రస్తుతం నోటిఫికేషన్ ప్రకారం డీఎస్సీ పరీక్షలు ఆన్‌లైన్‌లో దాదాపు నెల రోజులపాటు జరుగుతాయన్నారు. ఈ క్రమంలో ఒకే రోజు ఆఫ్‌లైన్లో అందరికీ ఒకేసారి పరీక్ష నిర్వహిస్తే సమన్యాయం జరుగుతుందన్నారు.

గిన్నిస్ బుక్‌లో చెరుకులపాడు వాసికి చోటు



ధ్రువపత్రం అందుకుంటున్న కొమ్ము చిరంజీవులు

కర్నూలు కల్చరల్: వెల్దుర్తి మండల పరిధిలోని చెరుకుల పాడు గ్రామానికి చెందిన కొమ్ము చిరంజీవులు కాలాంతక్‌కు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కింది. గత సంవత్సరం డిసెంబర్ 1వ తేదీన హలెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో మిస్టర్ ఆగస్టీన్, దండింగి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేదికగా పోటీలు నిర్వహించారు. దేశ విదేశాల నుంచి వేలాది మంది పాల్గొన్న ఈపోటీల్లో చిరంజీవులు కీ బోర్డు ప్రదర్శనలో ప్రతిభ కనబరిచి లండన్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో చోటు పొందారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో సంస్థ ప్రతినిధులు సర్టిఫికెట్లు, జ్ఞాపిక అందజేసినట్లు చిరంజీవులు తెలిపారు.

మహానందీశ్వరుడి దర్శనానికి రెండు గంటలు

మహానంది: సెలవురోజు కావడం, పెళ్లిళ్లు అధిక సంఖ్యలో ఉండటంతో వేలాది సంఖ్యలో భక్తులు మహానంది ఆలయానికి తరలిరావడంతో దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు నాగమల్లయ్య, పి.సుబ్బారెడ్డి, ఎం.నీలకంఠరాజులు ఏర్పాట్లు చేశారు.



సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



ద్రాక్షరసం పంపిణీ చేస్తున్న దృశ్యం



సీఎస్ఐ చర్చిలో ఈస్టర్ పండుగ సందేశమిస్తున్న ఫాదర్ వరప్రసాదరావు

ఘనంగా ఈస్టర్ వేడుకలు

- చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు
- యేసు చూపిన మార్గంలో నడవాలని పాస్టర్ల సందేశం

కర్నూలు (టౌన్): ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు.గుడ్‌ఫ్రైడే రోజున శిలువ మరణం పొందిన ఏసుక్రీస్తు మూడోరోజు పునరుత్థానుడు కావడంతో(మరణాన్ని జయించిన రోజును పురస్కరించుకుని) ఆదివారం ఉదయాన్నే కుటుంబసమేతంగా చర్చీలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు ఈస్టర్ సందేశాన్ని వివరించారు. ఈస్టర్ అంటే మానవ సంబంధాలను బలపరిచే, ప్రేమను పంచే, క్షమా గుణాన్ని పెంపొందించేదన్నారు. నగరంలోని స్థానిక కోల్స్ సెంటీనియల్ తెలుగు బాపిస్టు చర్చి పాస్టర్లు అనిల్ సామేల్, జీవన్ రావు, యోహోషువా చర్చి పాస్టర్ డాక్టర్ స్టీఫెన్ చార్లెస్, డాక్టర్ ప్రశాంతి శ్యామ్, గిప్సన్ సెంట్రల్ బాపిస్టు చర్చి పాస్టర్ కృపాదానం రాజు, సి. క్యాంపు ప్రార్థన మందిరం చర్చి పాస్టర్ రెవరెండ్ గంటా కరుణా సాగర్, దైవ సందేశకులు పాస్టర్ సజీవన్, సీఎస్ఐ చర్చి ఫాదర్ వరప్రసాదరావు, హోసన్న మందిరం పాస్టర్ ఫ్రెడీపాల్, హోరేబ్ చర్చి పాస్టర్ సమ్సోనన్న ఆయా చర్చీలలో ప్రత్యేక దైవ సందేశం ఇచ్చారు. యేసుక్రీస్తు బోధించిన మాటలను విశ్వసించి సన్మార్గంలో నడవాలన్నారు. అలాగే పునరుత్థానుడైన క్రీస్తు గురించి బైబిల్ బోధనలు చేశారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకొని మహిళలు, పురుషులు, యువతీ యువకులు క్రీస్తును లోకరక్షకుడిగా స్వీకరిస్తూ బాప్తిస్మాలు తీసుకొని ప్రభుబల్లలో పాల్గొన్నారు. ఈసందర్భంగా చర్చి సంఘ మహిళలు ప్రత్యేక గీతాలు ఆలపించారు.



సీక్యాంపు ప్రార్థన మందిరంలో ప్రార్థనకు హాజరైన క్రైస్తవులు



కోల్స్ చర్చిలో ప్రసంగిస్తున్న రెవరెండ్ అనిల్‌కుమార్







ధర్మపేట చర్చిలో సందేశమిస్తున్న పాస్టర్ సమ్సోనన్న, గణేష్‌నగర్ హోసన్న మందిరంలో బైబిల్ పఠనం చేస్తున్న క్రైస్తవులు, భక్తి గీతాలు ఆలపిస్తున్న దృశ్యం

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి



అగ్నిమాపక ఆయుధాలను పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు (టౌన్) : జిల్లాలో అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. ఆదివారం స్థానిక బి. క్యాంపు అగ్నిమాపక కేంద్రంలో ఏర్పాటు చేసిన అగ్ని మాపక వారోత్సవాల ముగింపు సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. జనసంచారం ఉండే అపార్టుమెంట్లు, సినిమా హాలు, ఆసుపత్రులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, పాఠశాలలు, పరిశ్రమలు, పెట్రోల్ బంకులు వంటి ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాలు, ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదం జరిగినప్పుడు 101కు సమాచారం ఇవ్వాలన్న విషయాన్ని తెలియజేయాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య మాట్లాడుతూ అగ్నిమాపక దళం సేవలు వెలకట్టలేనివన్నారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరిగినప్పుడు దానికి కారణమైన ఒక్కొక్క అంశాన్ని నివారించుకుంటూ ప్రమాద తీవ్రతను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో డిజాస్టర్ మేనేజ్ మెంటు డీపీఎం అనుపమ, జిల్లా ఫైర్ ఆఫీసర్ అవినాష్ జయసింహ పాల్గొన్నారు.

29న వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న సేవ్ వక్ఫ్ జేఏసీ నాయకులు

కర్నూలు(సెంట్రల్) : నగరంలో ఈనెల 29వ తేదీన వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నట్లు అవాజ్ కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి. ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్, జమాతే ఇస్లాం ఏ హింద్ నాయకులు పీఎస్ మున్నీర్ తెలిపారు. ఆదివారం సేవ్ వక్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో పాతబస్తీలో నిరసన కార్యక్రమాలు నాలుగో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్, ర్యాలీలు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఏప్రిల్ 30వ తేదీన రాత్రి 9 నుంచి 9.30 గంటల మధ్య వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా విద్యుత్‌ను నిలపుదల చేసి నిరసన వ్యక్తం చేయనున్నట్లు చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హఫీజ్, అఫ్రోజ్, అబ్దుల్ దేశాయ్, మార్లేళ్ల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.





ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న కాటసాని, మృతదేహానికి నివాళులర్పిస్తున్న కాటసాని

కాటసాని పరామర్శ

ఓర్వకల్లు: మండలంలోని కొమరోలు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అప్పన్నను వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి గురై గౌరిగోపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని ఆస్పత్రికి వెళ్లారు. ప్రమాదం జరిగిన తీరు, బాధితుని ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

సుబ్బారెడ్డికి నివాళి

పాణ్యం: విశ్రాంత వీఆర్‌ఓ సద్దల సుబ్బారెడ్డి (75) సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కొండజుటూరు గ్రామానికి చెందిన విశ్రాంత వీఆర్‌ఓ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన అన్న, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డితో పాటు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వారితో పాటు జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, సర్పంచ్ సద్దల సుజీత్‌రెడ్డి, గోరుకల్లు నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లప్ప, రోషి, కందిప్రసాద్ ఉన్నారు.

23న ఆలయ భూముల బహిరంగ వేలం

ఓర్వకల్లు: మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఈ నెల 23వ తేదీ ఆలయ భూములకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు గ్రూపు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి 11 ఎకరాలు, రామస్వామి దేవస్థానానికి ఉన్న 11.31 ఎకరాలు, చెన్నకేశవస్వామి దేవస్థానానికి సంబంధించి 257.14 ఎకరాల భూములకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన రైతులు అదే రోజు ఉదయం 10 గంటలలోగా రూ.2 వేలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. పాత బకాయిలు ఉన్న వారు వేలం పాటకు అనర్హులుగా ప్రకటించారు. వేలంలో పాల్గొన్న వారిలో హెచ్చు పాట దక్కించుకున్న వారికి ఏడాది పాటు భూములను కౌలుకు అనుభవించే హక్కును కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.

అధైర్య పడకండి అండగా ఉంటా

- నేతలతో మాజీ మంత్రి బుగ్గన



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: కూటమి ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు బనాయించినా అధైర్య పడొద్దని, అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ నాయకులకు మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి భరోసా ఇచ్చారు. డోన్ పట్టణంలోని ఆయన స్వగృహంలో ఆదివారం ఆయన పట్టణానికి చెందిన నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయించి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి కుటిల రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలతో అనేక విధాలుగా నష్టపోయిన విషయాన్ని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యా దీవెన ఎగ్గొట్టి విద్యార్థుల బంగారు భవిష్యత్తును నాశనం చేసిందన్నారు. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో పాటు రైతు భరోసా కింద ఆర్థికసాయాన్ని కూడా ఇవ్వకుండా రైతులను ఆత్మహత్య వైపు పురిగొల్పుతోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందని మాజీ మంత్రి ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ కోసం అహర్నిశలు అంకితభావంతో పని చేసేవారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. వచ్చే నాలుగేళ్లు కూటమి ప్రభుత్వం అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ నాయకత్వం ఎలాంటి పోరాటాలకు పిలుపునిచ్చినా ముందుండి ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ, జెడ్పీటీసీలు రేగటి రాజశేఖర్ రెడ్డి, బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేశ్, వైస్ చైర్మన్ జాకీర్, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు సోమేశ్ యాదవ్, మల్లికార్జున రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు ఆర్‌ఈ రాజవర్ధన్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కురుకుంద హరితో పాటు పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అవీ ఇవీ

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

నగరపాలక కార్యాలయంలో

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రవీంద్ర బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

లాడ్జీల్లో పోలీసుల సోదాలు



కర్నూలులోని ఓ లాడ్జిలో రికార్డులు పరిశీలిస్తున్న పోలీసులు

కర్నూలు (టౌన్): జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పోలీసులు పలు లాడ్జీలలో సోదాలు చేపట్టారు. లాడ్జీలకు వచ్చే వ్యక్తుల వివరాలు, గుర్తింపు కార్డులు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కొత్తగా వచ్చే వారి విషయంలో పూర్తి సమాచారం తీసుకున్న తర్వాతే రూమ్‌లు ఇవ్వాలని చెప్పారు. అలాగే రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. లాడ్జి పరిసరాలు స్పష్టంగా కనిపించేలా తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లాడ్జీల్లో బస చేసిన సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావిచ్చిన గట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నర్సింగ్ హోంపై ఫిర్యాదు

ఎమ్మిగనూరుటౌన్:పట్టణంలోని సునితనర్సింగ్ హోంపై తగిన చర్య తీసుకోవాలని కోరుతూ ఆదివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి ఫిర్యాదు చేసినట్లు పట్టణానికి చెందిన ఎంఎస్ ప్రియాంక, ఆమె భర్త ప్రకాశం తెలిపారు. ఎంఎస్ ప్రియాంక మాట్లాడుతూ.. 9 నెలలు నిండిన తాను పరీక్షల నిమిత్తం ఈనెల 29న ఆసుపత్రికి వెళ్లగా.. అష్టమి వున్నందున వైద్యురాలు రాదని చెప్పి సిబ్బంది నిర్లక్ష్యం చేశారని ఆరోపించింది. మరుసటి రోజు వెళ్లగా.. పరీక్షించిన డాక్టర్ గర్భంలోనే శిశువు చనిపోయిందని చెప్పి కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి పంపారన్నారు. క్రమం తప్పకుండా సునిత నర్సింగ్‌హోమ్‌లోనే తాను వైద్య పరీక్షలు చేయించుకునేదానినని, చివరి రోజుల్లో డాక్టర్ నిర్లక్ష్యం చేసి శిశువు మృతికి కారణమైందని వాపోయింది.

చిటారు కొమ్మన చిన్నోడు!

చెట్టులెక్క గలవా! ఓ నరహరి పుట్టలెక్కగలవా! చెట్టు నెక్కి ఆ చిట్టారు కొమ్మన చిగురు కోయగలవా అని ఓ కవి వర్ణించాడు. కవి చెప్పిన పాటలో మాదిరిగా ఓ చిన్నోడు చిటారు కొమ్మన చిగురు కోస్తున్నాడు. కల్లూరు మండలం బస్తిపాడు గ్రామంలో ఉన్న చింత వనంలో చెట్టుపై చిగురు కోస్తున్న దృశ్యం కనిపించింది.

-కల్లూరు



చరిత్రలో నిలిచేలా దాసి పన్నా రచన



సాహితీ వేత్త జేఎస్ఆర్కే శర్మను సన్మానిస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: విద్వాన్ షేక్ దావూద్ రచించిన 'దాసి పన్నా' చరిత్రలో నిలిచిపోతుందని సాహితీ వేత్త జేఎస్ఆర్కే శర్మ అన్నారు. సాహితీ సదస్సు ఆధ్వర్యంలో ఆదివారం మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఆచార్య ఎస్‌వీ కృష్ణమూర్తి స్మారకోపన్యాసం, విద్వాన్ షేక్ దావూద్ రచించిన 'దాసి పన్నా'పై సాహిత్య ఉపన్యాసం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాహితీ వేత్త జేఎస్ఆర్కే శర్మ మాట్లాడుతూ త్యాగానికి మారుపేరు దాసి పన్నా అన్నారు. పన్నాదైగా పిలవబడే ఈమె 16వ శతాబ్దానికి చెందిన రాణా సింగ్ కుమారుడైన ఉదయ్ సింగ్‌ను కాపాడటం కోసం తన సొంత కన్నబిడ్డనే శత్రువు ఖడ్గానికి బలి పెట్టిందని గుర్తు చేశారు. దాసి పన్నా దేశభక్తి, ధర్మానికి పట్టం కట్టిన తీరు చరిత్రాత్మకమన్నారు. సాహితీ సదస్సు అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర, క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం కళారత్న అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య, ఉగాది పురస్కార గ్రహీతలు డాక్టర్ హరికిషన్, ఎస్‌డీవీ అజీజ్‌లను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు షేక్ దావూద్ ఖాన్, ఎస్‌వీ కృష్ణమూర్తి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆంగ్ల ఉపన్యాసకులు షేక్ అబ్దుల్ ఖాదర్, సాహితీ వేత్తలు డాక్టర్ దండబోయిన పార్వతీ దేవి, డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, హైమావతి, సీతామహాలక్ష్మి, నీలిమ, సుశీల, లక్ష్మీ లక్ష్మయ్య, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, గంగధార్ రెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో ఈదురుగాలులతో వర్షం



దిన్నెదేవరపాడు గ్రామానికి వెళ్లే రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కల్లూరు: కొద్ది రోజులుగా ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఆదివారం సాయంత్రం కురిసిన వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. మండలంలోని కె.మార్కాపురం, ఎ.గోకులపాడు, సల్కాపురం గ్రామాల్లో ఈదురు గాలులతో వర్షం పడింది. అలాగే కల్లూరు అర్బన్ ప్రాంతాల్లో కూడా వర్షం కురిసింది. డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో దిన్నెదేవరపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు, హౌసింగ్ బోర్డు కాలనీలో రోడ్డుపై వర్షపు నీరు నిలిచింది.

నేడు మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష

కోడుమూరు రూరల్: స్థానిక మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆశా జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వి ద్యార్థులు హాల్‌టికెట్లతో పరీక్షకు హాజరు కా వాలని, హాల్ టికెట్ డౌన్‌లోడ్ కాని విద్యార్థులు 2 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఉదయాన్నే పాఠశాలలో సంప్రదించాలని సూచించారు

ప్రజాప్రతినిధుల రక్తదానం

కర్నూలు(రూరల్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు రక్తదానం చేశారు. ముందుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డితో కలిసి వారు నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని కేట్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీ సంజీవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో ఒకే పేపర్ ఉండేలా చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): డీఎస్సీలో జిల్లా అభ్యర్థులందరికీ ఒకే పేపర్..ఒకే రోజు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. అభ్యర్థుల అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. డీఎస్సీ సిలబస్ చదవడం కోసం కనీసం 60-90 రోజుల సమయం పడుతుందన్నారు. ఈ క్రమంలో ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన సమయం సరికాదన్నారు. పరీక్ష నిర్వహణకు 90 రోజులు వ్యవధి ఉండాలన్నది నిబంధన అని, దానిని పాటించకుండా ప్రభుత్వం ముందుకెళ్తున్నట్లు కనిపిస్తోందన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండల భవిత కేంద్రంలో ప్రతి సోమవారం దివ్యాంగులకు శారీరక అవయవాలకు వైద్యుడు వీరేష్ చేత ఫిజియోథెరపీ చేయిస్తున్నట్లు తెలిపారు.